సాక్షి
తూర్పుగోదావరి
గురువారం । 6 । ఫిబ్రవరి । 2025




గరుడ గమనా.. పుష్పక వాహనా..
కల్యాణ మహోత్సవాల్లో భాగంగా అంతర్వేది లక్ష్మీ నృసింహస్వామికి బుధవారం సాయంత్రం గరుడ పుష్పక వాహనం, రాత్రి పుష్పక వాహనంపై గ్రామోత్సవాలు నిర్వహించారు.



స్కూలు బస్సు ఢీకొని చిన్నారి మృతి
ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల బస్సు ఢీకొని మూడేళ్ల చిన్నారి శివకోటి సుకన్య దుర్మరణం పాలైన ఘటన తొండంగి మండలం సీతారాంపురంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

8లో

డెల్టాలకు 8,550 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 8,550 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,450, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,400 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.65 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలకు నియామకాలు



మహమద్ హబీబుల్లాఖాన్



గుడాల జాన్సన్

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో రాజమహేంద్రవరం నగరానికి చెందిన ఇద్దరు నాయకులను జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులుగా నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సిటీ నియోజవర్గానికి చెందిన ముస్లిం నాయకుడు మహమద్ హబీబుల్లా ఖాన్‌ను జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా నియమించారు. అలాగే, జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడిగా నగరానికి చెందిన గుడాల జాన్సన్ నియమించారు.

ఎత్తిపోతల పథకాలకు పూర్వ వైభవం

కొవ్వూరు: ఎత్తిపోతల పథకాలకు పూర్వ వైభవం తీసుకోచ్చేలా చర్యలు తీసుకుంటామని ఏపీ ఎస్ఐడీసీ ఎండీ వై.శ్రీనివాస్ ప్రకటించారు. ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ సాయిప్రసాద్ ఆదేశాల మేరకు గోదావరి నదిపై ఎత్తిపోతల పథకాలను బుధవారం ఆయన పరిశీలించారు. స్కీమ్‌ల నిర్వహణ తీరుపై రైతు సంఘాల నాయకులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎత్తిపోతల పథకం పనితీరుపై రైతులను ఆరా తీశారు. కుమారదేవం, తాళ్లపూడి మండలంలో వేగేశ్వరపురం, పైడిమెట్ట, పోలవరం మండలంలోని గుటాల, పోలవరం ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు రూ.20 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని ఆది శేషారావు వివరించారు. నీటి తీరువా సక్రమంగా వసూలు కావడం లేదని రైతుసంఘం ప్రతినిధులు తెలిపారు. ఎత్తిపోతల పథకం నిర్వహణ సక్రమంగా కొనసాగాలంటే రైతులు కచ్చితంగా నీటి తీరువా చెల్లించాల్సి ఉంటుందని ఎండీ శ్రీనివాస్ పేర్కొన్నారు. రైతు సంఘం అధ్యక్షులు గౌరిజాల సురేష్, కైగాల రాంబాబు, వట్టికూటి వెంకటేశ్వరరావు, డీఈఈ పి.దుర్గా గురవయ్య, ఏఈ ఎ.సురేంద్ర, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలి

రాజమహేంద్రవరం రూరల్: రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి కొత్తగా ప్రవేశపెట్టిన అగ్రిస్టాక్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. రాజవోలు రైతు సేవా కేంద్రంలో అగ్రిస్టాక్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ తీరును బుధవారం ఆయన పరిశీలించారు. రిజిస్ట్రేషన్‌లో ఇంకా ఏవైనా తప్పులుంటే రికార్డ్ చేసుకుని, ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఈ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని తెలిపారు. పీఎం కిసాన్ పథక కింద దీని ద్వారానే లబ్ధి అందుతుందన్నారు. సిబ్బంది రిజిస్ట్రేషన్ చేసినప్పుడు వంద శాతం చూపిస్తేనే ఆ రికార్డు నేరుగా తహసీల్దార్ లాగిన్‌కు అప్రూవల్‌కు వెళ్తుందని, 80 శాతం కన్నా తక్కువ ఉంటే వీఆర్వో లాగిన్‌లోకి వెళ్తుందని చెప్పారు. ఆధార్, సంబంధిత సర్వే నంబర్లలో ఏవైనా తప్పులుంటే వీఆర్వో సరిచేసి, మళ్లీ తహసీల్దార్ లాగిన్‌కు పంపుతారన్నారు. రిజిస్ట్రేషన్ అనంతరం 21 అంకెలతో గుర్తింపు నంబర్ ఆయా రైతుల మొబైల్ నంబర్‌కు మెసేజ్ వస్తుందని తెలిపారు. ఆధార్ కార్డ్, కొత్తగా వచ్చిన ఎల్పీ నంబర్‌తో కూడిన 1బి/పాస్ బుక్ జిరాక్స్, రేషన్ కార్డ్, ఆధార్ లింక్ అయిన ఫోన్ తీసుకుని రైతులు రైతు సేవా కేంద్రానికి వెళ్లాలని మాధవరావు సూచించారు.

గౌరవమేదీ..?

- మైనారిటీలపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు
- ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం విడుదలలో అంతులేని నిర్లక్ష్యం
- పది నెలలుగా నయా పైసా ఇవ్వని కూటమి సర్కారు
- జిల్లావ్యాప్తంగా 118 మసీదులు
- జిల్లాలో 236 మంది ఇమామ్, మౌజన్లు
- పది నెలలకు రూ.1.77 కోట్ల బకాయిలు



సాక్షి, రాజమహేంద్రవరం: ఏరు దాటాక తెప్ప తగలేసినట్లు.. ఎన్నికల్లో నెగ్గేందుకే హామీలు ఇవ్వడం.. అనంతరం వాటిని విస్మరించడం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. అన్ని వర్గాలు, కులాలను మభ్యపెట్టడం ఆయన నైజం. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు ప్రశ్నార్థకంగా మారడమే దీనికి నిదర్శనం. సార్వత్రిక ఎన్నికల సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించిన చంద్రబాబు అప్పట్లో అనేక హామీలు ఇచ్చారు. ముస్లిం మైనారిటీల ఓట్లు రాబట్టుకునేందుకు వారి ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం పెంచుతామని హామీలు గుప్పించారు. ప్రతి సభలోనూ దీనిపై ఊదరగొట్టారు. ఎన్నికల్లో మైనార్టీ ఓట్లతో గద్దెనెక్కారు. అధికారం చేపట్టాక మైనార్టీలను, వారికి ఇచ్చిన హామీలను పూర్తిగా పక్కన పెట్టేశారు.

పది నెలలుగా ఎదురు చూపులు

ముస్లింలకు మసీదులు అత్యంత పవిత్ర స్థలాలు. అందులో ప్రతి రోజూ ఐదు పూటలా ప్రార్థనలు (నమాజ్) జరుగుతాయి. నమాజ్ చదివించేందుకు ఇమామ్, అజాన్ ఇవ్వడం, మసీదు బాగోగులు చూసుకునేందుకు మౌజన్ ఉంటారు. వీరిద్దరికీ ఆ మసీదే జీవనాధారం. అందులో వచ్చే గౌరవ వేతనంతోనే కుటుంబాన్ని పోషించుకుంటారు. అలాంటి వారికి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి నయా పైసా విడుదల చేయకపోవడంతో కుటుంబ పోషణ ఇబ్బందికరంగా మారిందని వారు ఆవేదన చెందుతున్నారు.

హామీ అమలయ్యేనా!

సార్వత్రిక ఎన్నికల సమయంలో ముస్లింలపై చంద్రబాబు హామీల వర్షం కురిపించారు. అందులో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇమామ్‌లకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన రూ.10 వేలకు మరో రూ.5 వేలు కలిపి రూ.15 వేలు ఇస్తామని ప్రకటించారు. మౌజన్‌లకు గత ప్రభుత్వం అందించిన రూ.5 వేలకు మరో రూ.5 వేలు కలిపి నెలకు రూ.10 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. తద్వారా ఎన్నికల్లో ముస్లింల ఓట్లను తమవైపు తిప్పుకున్నారు. అధికార పగ్గాలు చేపట్టారు. ఇంకేముంది తమకు మంచి జరుగుతుందని ముస్లింలు భావించారు. ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం పెరుగుతుందని ఆశగా ఎదురు చూశారు. పాలన ప్రారంభించి ఎనిమిది నెలలు గడుస్తున్నా.. చంద్రబాబు హామీలకు అతీగతి లేకపోవడంతో తాము మరోసారి మోసపోయామని భావిస్తున్నారు. ప్రతి నెలా గౌరవ వేతనం విడుదలవుతుందని ఎదురు చూడటం తప్ప చేసేదేమీ లేదని నిట్టూరుస్తున్నారు. నెల రోజుల్లో పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం కానుంది. సెహరీలకు, ఇఫ్తార్లకు, ప్రత్యేక తరావీ నమాజులకు ప్రతి నెలా జరిగే దానికంటే ఖర్చు నాలుగింతలు అధికంగా అవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో అసలు నెలవారీ వేతనాలే రాకుంటే, ఇక ప్రత్యేక నిధులేం వస్తాయని పలువురు ఆవేదన చెందుతున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సముచిత గౌరవం

ముస్లింల ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేసిన వైఎస్సార్ సీపీ అధినేత, నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో రూ.5,000గా ఉన్న ఇమామ్‌ల గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచారు. రూ.3,000గా ఉన్న మౌజన్ గౌరవ వేతనాన్ని రూ.5 వేలకు పెంచారు. దీనికోసం ప్రత్యేక జీవో విడుదల చేశారు. అప్పటి నుంచీ ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాలు క్రమం తప్పకుండా అందించేవారు. మసీదుల నిర్వహణను సులభతరం చేశారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఒక్క నెల కూడా బకాయి లేకుండా గౌరవ వేతనాలు చెల్లించడం విశేషం.

జిల్లాలో ఇలా..



జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం గుర్తించిన మసీదులు 118 ఉన్నాయి. వీటిలో 118 మంది ఇమామ్, 118 మంది మౌజన్‌లు విధులు నిర్వర్తిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలు కారణంగా గతంలో రెండు నెలల బకాయిలు నిలిచిపోయాయి. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి నేటి వరకూ సుమారు ఎనిమిది నెలలు అంటే.. పది నెలలకు సంబంధించి గౌరవ వేతనాన్ని విడుదల చేయాల్సి ఉంది. ఈ లెక్కన జిల్లావ్యాప్తంగా 118 మంది ఇమామ్‌లకు ఒక్కో నెలకు రూ.10 వేల చొప్పున పది నెలలకు రూ.1.18 కోట్లు, మౌజన్లకు ఒక్కొక్కరికి నెలకు రూ.5 వేల చొప్పున పది నెలలకు రూ.59 లక్షలు.. కలిపి మొత్తం రూ.1.77 కోట్ల మేర ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉన్నా.. పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ నిధులు ఎప్పుడు విడుదల చేస్తుందో అంతు చిక్కని ప్రశ్నగా మారింది.

తక్షణం విడుదల చేయాలి



ఆదాయం లేని మసీదుల్లోని ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాలు చెల్లించడంలో గతంలో ఎన్నడూ లేనంతగా తీవ్ర నిర్లక్ష్యాన్ని కూటమి ప్రభుత్వం ప్రదర్శిస్తోంది. నెలల తరబడి నిధుల విడుదల చేయకపోతే మసీదుల నిర్వహణ ఎలా సాధ్యం? పది నెలలుగా వేతనాలు లేక ఇమామ్, మౌజన్‌లు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ఈ పరిస్థితి తలెత్తింది. గౌరవ వేతనంతో పాటు మసీదుల నిర్వహణకు నెలకు రూ.5,000 అందిస్తామని ఇచ్చిన హామీ ఎప్పుడు అమలు చేస్తారు? వేతన బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

– మొహమ్మద్ ఆరిఫ్, జిల్లా మాజీ వక్ఫ్‌బోర్డ్ చైర్మన్

పబ్లిక్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

- కలెక్టర్ ప్రశాంతి
- అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సమన్వయ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. 43,754 మంది ఇంటర్ విద్యార్థులకు 51 పరీక్షా కేంద్రాలు, 25,723 మంది టెన్త్ విద్యార్థులకు 134 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆయా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను గంట ముందుగానే అనుమతిస్తారని, ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోరని స్పష్టం చేశారు. ఇంటర్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకూ, టెన్త్ పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ జరుగుతాయన్నారు. జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి ఎన్ఎస్‌వీఎల్ నరసింహం మాట్లాడుతూ, ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 20,591 మంది, రెండో సంవత్సరం 19,062 మంది, ఒకేషనల్ మొదటి సంవత్సరం 2,226 మంది, రెండో సంవత్సరం 1,875 మంది హాజరు కానున్నారని వివరించారు. పరీక్షలు నిర్వహించే రోజుల్లో ఆర్ఐవో కార్యాలయంలో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకూ 0883–2473430 నంబర్‌తో కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంటుందన్నారు. ఐదు సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి ప్రత్యేక ఏర్పాట్లు చేశామని తెలిపారు. జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు మాట్లాడుతూ, పదో తరగతి పరీక్షలకు రెగ్యులర్‌గా 24,763 మంది (బాలురు 12,791, బాలికలు 11,972), ప్రైవేటుగా 960 మంది (బాలురు 591, బాలికలు 369) హాజరు కానున్నారని తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ మురళీకృష్ణ, డీఆర్వో టి.సీతారామమూర్తి, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, జిల్లా ఒకేషనల్ అధికారి జీవీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ నృత్యహేల



అలరించిన గిరిజన నృత్య ప్రదర్శనలు



ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య శ్రీనివాసరావు



- 'నన్నయ'లో ఆదివాసీ సంస్కృతీ మహోత్సవాలు ప్రారంభం
- గిరిజన సంప్రదాయ నృత్యాలతో అలరించిన కళాకారులు

రాజానగరం: థింసా, లంబాడీ వంటి గిరిజన నృత్యాలు ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఆవిష్కృతమయ్యాయి. ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) జాతీయ కమిటీ ఆధ్వర్యాన రెండు రోజుల పాటు జరిగే ఆదివాసీ సంస్కృతీ మహోత్సవాలు యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన ఆదివాసీ కళాకారులు ప్రదర్శించిన జానపద, థింసా, లంబాడీ వంటి నృత్య ప్రదర్శనలు సభికులను విశేషంగా అలరించాయి. వేదికపై ఆశీనులైన ముఖ్య అతిథులు సైతం స్పందించి, కొద్దిసేపు కళాకారులతో కలసి డ్యాన్సు లేసి, విద్యార్థులను కేరింతలు కొట్టించారు.

ఆదివాసీ సంస్కృతిని కాపాడుకోవాలి

ఉత్సవాల ప్రారంభ సభలో యూనివర్సిటీ ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ, భారతీయ సంస్కృతిలో ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలు ఒక భాగమని, వాటిని కాపాడుకోవడం మనందరి బాధ్యతని అన్నారు. గోదావరి జిల్లాల్లోని గిరిజన, గిరిజనేతర విద్యార్థులందరికీ ఉన్నత విద్య అందిస్తూ, వారి ఉన్నతికి వర్సిటీ పరంగా కృషి జరుగుతోందని చెప్పారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ, తెలుగు భాష, సంస్కృతి, సాహిత్యాన్ని పరిరక్షించడంలో అందరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ, గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు, కళలతోనే సమాజ వికాసం జరుగుతుందన్నారు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ, అడవి బిడ్డల జీవన విధానం ప్రత్యేక శైలిలో, ఆరోగ్యకరంగా ఉంటుందని అన్నారు. టీఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు కరంసి అక్కులప్ప నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, ప్రధాన కార్యదర్శి మూడవత్ విష్ణు నాయక్ మాట్లాడుతూ, గిరిజనుల అభివృద్ధిలో నాటికి, నేటికి పెద్దగా తేడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల సూచించారు. గిరిజన ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కల్పించి, ప్రోత్సహించాలని టీఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లి భాస్కర్, సహాయ అధ్యాపకుడు దొర కోరారు. విద్యావంతులైన గిరిజన యువత ఈ–కామర్స్, డిజిటల్ వ్యాపారాలపై దృష్టి పెట్టాలన్నారు. తొలుత ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ గిరిజన ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు వర్సిటీ ప్రధాన ద్వారం నుంచి వేదిక వరకూ సంప్రదాయ నృత్యాలతో ఊరేగింపుగా చేరుకున్నారు. సెంట్రల్ లైబ్రరీ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీంద్రనాయక్, మహిళా అధ్యక్షురాలు మధులత, ఉపాధ్యక్షురాలు హేమలత, జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, రాష్ట్ర నాయకులు, జానపద కళాకారులు భిక్షు నాయక్, కంటి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 - 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,000 - 14,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి మృతి

అన్నవరం: స్థానిక రైల్వేస్టేషన్ మొదటి ప్లాట్‌ఫాం చివర గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మంగళవారం రాత్రి పట్టాలు దాటుతుండగా విజయవాడ వైపు వెళ్తున్న రైలు ఢీకొట్టడంతో అతడు మృతి చెందాడని, అతని శరీరం నుజ్జవడంతో గుర్తు పట్టడానికి వీలు లేకుండా ఛిద్రమైందని తుని రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతుని వయస్సు 40 సంవత్సరాలు ఉంటుందని, సిమెంట్ రంగు జీన్ ప్యాంటు, నలుపు రంగు షర్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. కుడి మోచేయి పైన సిరి అని ఇంగ్లీషులో పచ్చబొట్టు ఉందని తెలిపారు. మృతుడి శరీర భాగాలను తుని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరచినట్టు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిపిన వారు తుని రైల్వే పోలీస్ స్టేషన్, ఫోన్ నెంబర్ 94906 19020 నెంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని కోరారు.

రైల్వేస్టేషన్‌లో వృద్ధుడు..



గుర్తు తెలియని మృతుడు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్ 4–5లలో సుమారు 70 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై లోవరాజు బుధవారం తెలిపారు. మృతదేహాన్ని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడు ఆకుపచ్చ రంగు స్వెటర్, బూడిద రంగు జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతుని గురించి ఏదైనా సమాచారం ఉంటే 94406 27551, 94914 44022 నంబర్లకు తెలియజేయాలన్నారు.

పేకాడుతున్న 9 మంది అరెస్టు
రూ.77 వేల స్వాధీనం

అమలాపురం టౌన్: స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓ ఇంట్లో పేకాడుతున్న బృందంపై పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం రాత్రి దాడి చేశారు. 9 మంది జూదరులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.77,520 నగదు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

గరుడ గమనా.. పుష్పక వాహనా..

- లక్ష్మీ సమేతుడై ఊరేగిన నారసింహుడు
- తన్మయంతో దర్శించిన భక్తజనం
- ఏర్పాట్లు చేసిన అధికారులు



విద్యుద్దీపాలంకరణలతో ఆకట్టుకుంటున్న ప్రధాన, ఉపాలయాలు



గరుడ, పుష్పక వాహనంపై ఊరేగుతున్న స్వామివారు



ఐజీ అశోక్ కుమార్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

సఖినేటిపల్లి: అంతర్వేదిలో కొలువైన లక్ష్మీ నృసింహస్వామి దివ్య తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం గరుడ పుష్పక వాహనంపైన, రాత్రి పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవాలు ఘనంగా నిర్వహించారు. నిత్యం తనను సేవించే గరుడ వాహనంపై అధిరోహించడమే గరుడ వాహన సేవలోని పరమార్థం. అలాగే తన హృదయ మనే పుష్పకంలో ఎంతమంది భక్తులు వచ్చినా చోటు కల్పిస్తానని చాటేందుకు స్వామివారు పుష్పక వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. ఇది పుష్పక వాహనం పరమార్థం. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, చైర్మన్, ఆలయ వ్యవస్థాపక అనువంశిక సభ్యుడు రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ప్రముఖులు, సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్కాంతులతో దేవతామూర్తుల ఫ్లెక్సీలు

లక్ష్మీ నృసింహస్వామి వారి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయం వద్ద విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన దేవతామూర్తుల ఫ్లెక్సీలు భక్తులను ఎంతోగానో ఆకట్టుకుంటున్నాయి. వీటితో పాటు పశ్చిమ రాజగోపురం, ప్రధాన, ఉపాలయాల గోపురాలు విద్యుల్లతలతో శోభిల్లుతున్నాయి.

అంతర్వేదిలో నేడు..

ఉత్సవాల్లో భాగంగా గురువారం మూడో రోజు ఉదయం 5 గంటల నుంచి సుప్రభాత సేవ, 5.30 నుంచి 7 గంటల వరకూ స్వామివారి తిరువారాధన, బాలభోగం, ఆర్జిత అభిషేకం, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు, ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ సుదర్శన హోమం, సాయంత్రం 4 గంటలకు హంసవాహనంపై, 6.30 గంటలకు ధూపసేవ అనంతరం ధ్వజారోహణ. రాత్రి 8 గంటలకు శేషవాహనంపై గ్రామోత్సవాలను నిర్వహించనున్నారు.

స్వామివారి సన్నిధిలో ఏలూరు రేంజి ఐజీ

అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని పి.విజయ సారధి అందజేశారు. ఆయన వెంట కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీ మోహన్, రాజోలు సీఐ టీవీ నరేష్ కుమార్, ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో ఏర్పాట్ల పరిశీలన

అంతర్వేది ఉత్సవాలను పురస్కరించుకుని ఐజీ అశోక్ కుమార్ అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. 7వ తేదీన నిర్వహించే స్వామివారి కల్యాణ వేదిక వద్ద, వేదిక ఇరువైపులా ఉన్న భారీ షెడ్లలో గ్యాలరీల ఏర్పాట్లపై ఆలయ సూపరింటెండెంట్ విజయ సారధి ఐజీకి వివరించారు. 8న రథోత్సవం, 12న పౌర్ణమి సముద్ర స్నానాల ఏర్పాట్లను సైతం ఐజీ సమీక్షించారు.

8న పుట్టకొండ లక్ష్మీ నరసింహుని కల్యాణం



ప్రత్యేక అలంకరణలో కల్యాణ మూర్తులు లక్ష్మీ నరసింహస్వామి, గోదాదేవి, వేంకటేశ్వరస్వామి



పుట్టకొండ గ్రామంలోని స్వామి వారి ఆలయం

పెదపూడి: శతాబ్దాల చరిత్ర కలిగిన పెదపూడి మండలం పుట్టకొండ లక్ష్మీ నరసింహస్వామి దివ్య కల్యాణం ఈ నెల 8న ఘనంగా నిర్వహించనున్నారు. స్వామివారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందీ కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఈఓ వడ్డాది సత్యనారాయణ, ఆలయ వ్యవస్థాపక సభ్యుడు పి.అనంతాచార్యులు తెలిపారు. 8న భీష్మ ఏకాదశి శనివారం రాత్రి తెల్లవారు జామున 4 గంటలకు అనగా (ఆదివారం) స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు. అనంతరం తొమ్మిదో తేదీన నిత్యహోమం, బలిహరణ, పదిన గజవాహన సేవ, 11న అశ్వవాహన సేవ, 12న పూర్ణాహుతి, చక్రతీర్థం, 13న శ్రీ పుష్పయాగం, ద్వాదశ అర్చనలతో కల్యాణోత్సవాలు ముగియనున్నాయి.

అలసిన మనసుకు సాంత్వన కళ

- ప్రముఖ కవి జొన్నవిత్తుల
- చిత్తు కాగితాలతో చిత్తరువుల రూపకల్పన
- శ్రీప్రకాష్‌లో ఆకట్టుకున్న 'హరివిల్లు'



చిత్రాలు, కళారూపాలను అతిథులకు వివరిస్తున్న చిన్నారి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): మానవ జీవితంలో కళ అత్యుత్తమమైనదని, అది అలసిన మనసుకు ప్రశాంతతను ఇస్తుందని సుప్రసిద్ధ కవి, సినీ గేయ రచయిత, తెలుగు అధికార భాషా సంఘ మాజీ సభ్యుడు జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సురేష్‌నగర్‌లో శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో 'హరివిల్లు–2025' ఆర్ట్ ఎగ్జిబిషన్ ఘనంగా ప్రారంభమైంది. విద్యార్థులలో నిద్రాణమై ఉన్న శక్తిని వెలికి తీసి, సమాజానికి ఒక అద్భుతమైన సందేశాన్ని ఇచ్చేలా కళాకృతులు ఉన్నాయన్నారు. గౌరవ అతిథి భారతీయ చిత్రకారిణి, ప్రింట్ మేకర్ గౌరి వేముల మాట్లాడుతూ కళ అనేది తపస్సు అని, కళాకారుడు ఒక ఋషీశ్వరుడని అన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. పాఠశాల డైరెక్టర్ విజయప్రకాష్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. గ్రంధి రాజగోపాల్, ఆల్ ఈజ్ వెల్ వ్యవస్థాపకుడు కిశోర్‌కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు ఫర్నిచర్ వితరణ



బహూకరించిన ఫర్నిచర్‌తో ఎస్‌బీఐ అధికారులు, ఉపాధ్యాయులు

ఆలమూరు: మండలంలోని చెముడులంక జెడ్పీ హైస్కూల్‌కు రాజమహేంద్రవరం ఎస్‌బీఐ శాఖ రీజనల్ మేనేజర్ తాడిపత్రి శ్రీనివాస్ రూ.ఐదు లక్షల విలువైన ఫర్నిచర్ బహూకరించారు. బుధవారం స్థానిక హైస్కూల్‌కు ఆయన హాజరై హెచ్‌ఎం భమిడిపాటి శివరామకృష్ణకు 18 బెంచీలు, రెండు కంప్యూటర్లు, నాలుగు బీరువాలతో పాటు ఉపాధ్యాయులకు పది టేబుళ్లు, కుర్చీలను అందజేశారు. అలాగే హైస్కూల్‌కు అవసరమైన మైక్ సిస్టమ్‌ను సైతం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్‌ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ తమ రీజన్ పరిధిలో 43 శాఖా కార్యాలయాలు ఉన్నాయని, చెముడులంకలో సుదీర్ఘకాలంగా ఉన్న తమ శాఖా కార్యాలయంలో వేలాది మంది ఖాతాదారులు ఉన్నారన్నారు. ఖాతాదారుల ప్రయోజనాలతో పాటు విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలనే ఉద్దేశంతో జెడ్పీ హైస్కూల్‌కు ఈ ఫర్నీచర్ బహూకరించామన్నారు. హెచ్‌ఎం శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎస్‌బీఐ హెచ్‌ఆర్ మేనేజర్ పవన్ కుమార్, బ్రాంచ్ మేనేజర్ వెంకట రమణను ఘనంగా సత్కరించారు. ఎంపీటీసీ తమ్మన భాస్కరరావు, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి వెంకటరత్నం, పీఎంసీ కమిటీ చైర్మన్ నాగిరెడ్డి రాము, అభివృద్ధి కమిటీ చైర్మన్ తిర్నాతి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్కూలు బస్సు ఢీకొని చిన్నారి మృతి



శివకోటి సుకన్య (ఫైల్)



పాప మృతితో న్యాయం చేయాలని ఆందోళన చేస్తున్న దళిత సంఘాల నాయకులు

తొండంగి: మండలంలోని సీతారాంపురం గ్రామంలో బుధవారం స్కూలు బస్సు ఢీకొని మూడేళ్ల పాప మృత్యువాతపడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తునికి చెందిన ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల బస్సు విద్యార్థులను ఎక్కించుకుని వెళ్తుండగా సీతారాంపురంలో మూడేళ్ల పాప శివకోటి సుకన్య (3)ను బస్సు ఢీకొట్టింది. దీంతో ఆ చిన్నారి అక్కడికక్కడే మృత్యువాతపడింది. దీంతో చిన్నారి తండ్రి శివకోటి సింహాద్రి అప్పన్న ఇతర కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై దళిత సంఘాల నాయకులు కొల్లా బత్తుల దిలీప్, శివకోటి అప్పారావు, జట్టు చిన్నబాబు, అంబేడ్కర్ యూత్ సభ్యులు ఆందోళన చేయడంతో ఇన్‌చార్జి ఎస్సై బి.కృష్ణమాచారి అక్కడికి చేరుకున్నారు. దీంతో స్కూలు యాజమాన్యం స్పందించి పాప కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. పాప తండ్రి అప్పన్న ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌చార్జి ఎస్సై బి.కృష్ణమాచారి తెలిపారు.

ప్రేమించి వంచించాడు.. పెళ్లంటే పొమ్మన్నాడు..

బాలుడిపై బాలిక ఫిర్యాదు

రాజానగరం: ప్రేమించానన్నాడు.. వంచించాడు.. పెళ్లి మాటెత్తితే కాదు పొమ్మన్నాడు. 16 ఏళ్ల బాలిక 18 బాలుడిపై ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బుధవారం రాజానగరంలో జరిగిన ఈ సంఘటనపై స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. రాజానగరానికి చెందిన ఆ మైనర్లు కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. నరేంద్రపురం కూడలిలో జులాయిగా తిరిగే ఆ బాలుడు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుకునే రోజుల నుంచి ఆమె వెంట పడేవాడు. చివరకు తనతోనే లోకం అనేలా ఆమెకు మాయమాటలు చెప్పి లోబరుచుకున్నాడు. పదో తరగతి వరకు చదివిన ఆ బాలిక పెళ్లి చేసుకుందామని ఒత్తిడి చేయడంతో పెళ్లంటే తనకు ఇష్టం లేదని పొమ్మన్నాడు. దీనితో న్యాయం కోసం ఆ బాలిక స్థానిక పోలీసులను ఆశ్రయించింది. ఇద్దరూ మైనర్లే కావడంతో పోలీసులు పోక్సో కేసుగా నమోదు చేసి, నార్త్ జోన్ డీఎస్పీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎస్సై నారాయణమ్మ దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



పోలీసులు రికవరీ చేసిన బంగారు ఆభరణాలు

తాళ్లపూడి: పలు చోరీ కేసుల్లో నింతుడిని అరెస్టు చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మండలంలోని పెద్దేవంలో జనవరి 30న ఓ ఇంట్లో జరిగిన చోరీ కేసును ఐదు రోజుల్లో ఛేదించినట్టు ఎస్సై తెలిపారు. మలకపల్లి బస్టాండ్ వద్ద మంగళవారం గోపాలపురం మండలం బీమోలుకు చెందిన చుక్కల బాబిని నిందితుడుగా గుర్తించి అదుపులోకి తీసుకుని పోగొట్టుకున్న మంగళ సూత్రాలు, నల్లపూసలు, ఉంగరాలు, పట్టీలు, బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు. కొవ్వూరు రూరల్ సీఐ విజయబాబు పర్యవేక్షణలో సీసీఎస్ ఎస్సై రవీంద్రతో కలిసి కేసును ఛేదించి సొత్తును రికవరీ చేశారు. నిందితుడు బాబీని కోర్టులో హాజరు పరచినట్టు ఎస్సై తెలిపారు.

చెడు వ్యసనాలకు బానిసై చోరీలు

- ముగ్గురు మైనర్లతో పాటు ఆరుగురి అరెస్టు
- 13 మోటార్ సైకిళ్ల స్వాధీనం
- అమలాపురం డీఎస్పీ ప్రసాద్



స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిళ్లను చూస్తున్న డీఎస్పీ ప్రసాద్, రూరల్ సీఐ ప్రశాంత్ కుమార్

అమలాపురం రూరల్: చెడు వ్యసనాలకు బానిసలైన ముగ్గురు యువకులు మరో ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకుని వారు దొంగిలించిన 13 మోటారు సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కోనసీమతో పాటు ఇతర జిల్లాల్లో మోటారు సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న వారి వివరాలను డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేవలం గంజాయి, మద్యం తదితర వ్యసనాలతో డబ్బుకోసం వారు ఈ చోరీలకు పాల్పడినట్టు తెలిపారు. కోనసీమలోని వివిధ పోలీస్ స్టేషన్‌తో పాటు విశాఖ జిల్లా పరిధిలోని కంచర్లపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో వారు దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. వారి నుంచి రూ.8.82 లక్షల విలువైన 13 మోటార్ సైకిళ్లను, మూడు బ్యాటరీలను రికవరీ చేసినట్టు డీఎస్పీ తెలిపారు.

నిందితులైన కాట్రేనికోన మండలం చెయ్యేరు గున్నేపల్లికి చెందిన మేకల వీర వెంకట శ్రీరామ్ మూర్తి, అమలాపురం మండలం ఈదరపల్లి చెందిన వీరమల్లు తరుణ్ శశికుమార్, ముమ్మిడివరం మండలం అనాతవరానికి చెందిన దొంగ లోకేష్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్టు తెలిపారు. రూరల్ సీఐ ప్రశాంత్ కుమార్ పర్యవేక్షణలో తాలూకా ఎస్సై వై.శేఖర్‌బాబు. క్రైమ్ ఏఎస్సై సుబ్బారావు, హెచ్‌సీ రవికుమార్, పీసీలు శివకుమార్, ధర్మరాజు నిందితులను పట్టుకోవడంలో శ్రమించారన్నారు. వారికి రివార్డులు ఇవ్వనున్నట్టు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువతి మృతి

అమలాపురం టౌన్: ఈనెల 2న స్థానికంగా జరిగిన ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అమలాపురం రూరల్ మండలం ఎ.వేమవరానికి చెందిన నలబ శ్రీదేవి (20) చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపిన వివరాల మేరకు పదో తరగతి వరకూ చదివి ఇంటి వద్దే ఉంటున్న శ్రీదేవి అమలాపురం మార్కెట్ వీధిలోని బంధువులు ఇంటికి వచ్చి ఆటోలో ఓడలరేవు బీచ్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై తలకు తీవ్ర గాయమై విషయం తెలిసిందే. పోస్టుమార్టం అనంతరం ఆమెకు అంత్యక్రియల సందర్భంగా ఆమె జ్ఞాపకాలను తలచుకుని కుటుంబీకులు రోదించారు. ఈ ప్రమాదంలో గాయపడిన మిగిలిన ఏడుగురి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని సీఐ తెలిపారు.